# ఎవరి కోసం బ్రతకాలి ?

నేను అతని వెంట నడిచాను.

జర్నలిజం కోర్స్ చేసిన తరువాతఒక దిన పత్రిక కార్యాలయంలో పని చేసే అవకాశం లభించింది నాకు. ఆ దిన పత్రిక యజమానికి మిత్రుడైన ఒకాయన ద్వారా అందులో ప్రవేశం సంపాదించగలిగాను. నేను చేరడానికి వెళ్లిన రోజున ఆ దిన పత్రిక సంపాదకుడు న్యూస్ ఎడిటర్ చంద్రశేఖర్‌ని తన గదిలోకి పిలిపించి, నాకు పత్రిక కార్యాలయాన్నీ, వివిధ ప్రచురణ విభాగాల్నీ చూపించమని చెప్పాడు. దూరం నుంచి ఆడవాళ్లూ, మగవాళ్లూ ఆ పత్రికలో పని చేస్తున్న వాళ్ళు నాకేసి వింతగా చూస్తున్నారు! చంద్రశేఖర్ ప్రత్యేకంగా కూడా తీసికెళ్లి చూపిస్తున్నాడంటే చాలా ముఖ్యమైన మనిషి అయి ఉండాలన్నట్లుగా గౌరవభావంతో చూశారు కొందరు నా వైపు.

నన్ను ఎడిటోరియల్ వింగ్‌లోకి తీసుకు వెడతానని అతను అంటూండగా, ఒకావిడ ఇంచుమించు నా వయస్సులోనే ఉంది, విసురుగా వచ్చి, 'ఏమిటి శేఖర్‌గారూ, ఇందాకటి నుంచి మీ కోసం వెయిట్ చేస్తున్నాను, టీ చల్లారి పోతోంది' అంది—ఇంట్లో నేను మా ఆయన మీద

విసుక్కున్నంత చనువుగా విసుక్కుంది ఆ అమ్మాయి. మనసులోనే నవ్వుకున్నాను.

చంద్రశేఖర్ నన్ను ఆ అమ్మాయికి పరిచయం చేశాడు. 'గోల్డ్ మెడలిస్ట్'నని కూడా చెప్పాడు. ఆ అమ్మాయి పేరు రాగిణి. నన్ను కూడా తమతో కలిసి టీ తీసుకోవడానికి పిలిచింది. చంద్రశేఖర్ రాగిణిని అనుసరించడంతో, నేనూ అతన్ని అనుసరించక తప్పలేదు.

ముగ్గురం టీ తీసుకుంటున్నంత సేపూ వాళ్లిద్దరూ తమ వర్క్ గురించి చర్చించుకుంటూనే ఉన్నారు. వాళ్ళ హావభావాలు గమనిస్తూ కూర్చున్నాను నేను. మధ్య మధ్య అతను రాగిణిని గేలి చేస్తున్నాడు. తను ఉడుక్కోకుండా ఝుమాయించి వాదిస్తోంది అతన్ని రెచ్చగొడుతూ.

టీ తీసుకోవడం కాగానే కుర్చీలోంచి లేచి, 'తక్కిన సెక్షన్స్ కూడా ఈవిడకి చూపించి తీసుకొస్తాను' అని చెప్పి బయలుదేరాడు.

నేను అతని వెంట నడిచాను.

దారిలో, నేను ఎక్కడ ఉంటున్నాననీ, నా భర్త ఏం పని చేస్తున్నారనీ అడిగాడు. చెప్పాను. 'పిల్లలున్నారా?' అని అడిగాడు. లేరని బుర్ర ఊపాను. 'మీరూ నాజట్టే నన్నమాట' అన్నాడు చిరునవ్వుతో. నేనూ చిరునవ్వు నవ్వాను.

ఉద్యోగ నిర్వహణలో ఏ సమస్య వచ్చినా చంద్రశేఖర్ నాకు సహాయ పడేవాడు. రాగిణి కూడా సలహా లిస్తూండేది అవసరమైనప్పుడల్లా. రాగిణి, చంద్రశేఖర్—ఇద్దరూ నియమంగా ఒకచోట కూర్చుని టీ, లంచ్ తీసుకునేవారు. ఎవరైనా వాళ్లతో కలిస్తే కలిసేవారు, లేకపోతే లేదు.

ఉషారాణి అనే అమ్మాయితో క్రమంగా స్నేహంచేసి, తనతోనే కలిసి భోం చేస్తూండేదాన్ని. టీ తీసుకోవడం నా కంత అలవాటు లేదు. పొద్దుటి నుంచి సాయంకాలం దాకా శ్రద్ధగాపని చేస్తూ కూర్చునేదాన్ని.

సంపాదకుడు గోపీకృష్ణ నా పనిపాటల్ని కొంత స్వయంగా గమనించి, చంద్రశేఖర్ దగ్గర నుంచి 'రిపోర్ట్' తీసుకుంటూండేవాడు. కొంత కాలం అయాక, చంద్రశేఖర్‌తో కలిసి పని చెయ్యమన్నాడు నన్ను. ఎంతో సంతోషించాన్నేను. అటువంటి తెలివైన వాడికిందా, మర్యాదస్తుడి దగ్గరా పనిచెయ్యడం నా అదృష్టం అనుకున్నాను.

చంద్రశేఖర్‌కి గోపీకృష్ణతో ఈ మధ్య పడటంలేదని గ్రహించాను. నేను చేరిన కొత్తలో అటువంటి పరిస్థితి లేదు. ఇప్పుడు గోపీకృష్ణ చాలా ముభావంగా ఉంటున్నాడతనితో. ఈ మధ్య ఇంకా చాలా పరిణామాలు జరిగాయి. రాగిణికి వివాహం అయింది. అయినా, తన ప్రవర్తనలో నాకేమీ భేదం కనిపించలేదు. ఇది వరకులాగే చంద్రశేఖర్‌తో స్నేహంగానే ఉంటోంది. డ్యూటీ ఒకే సమయంలో పూర్తయితే, ఇద్దరూ కలిసి వెళ్లేవారు బయటికి. కానీ, ఒక తేడా—రాగిణి సెక్షన్ మారడం వల్ల తను వేరే గదిలో కూర్చుంటోందీ మధ్య. ఏ కారణమూ వివరించకుండానే, ఆదివారం అనుబంధం చూసే సెక్షన్‌కి మార్చాడుట గోపీకృష్ణ, ఆ రహస్యం ఉషారాణి నాతో చెప్పింది- ఈ మధ్య రాను రాను చంద్రశేఖర్ పలుకుబడి పెరుగుతోందిట. నగరంలోని మేధావులందరికీ ఆప్తుడవుతున్నాడుట. పత్రికా సంపాదకుడినంటూ గిరి గీసుకుని కూర్చునే గోపీకృష్ణ దగ్గరకన్న, ఎల్లవేళలా చిరునవ్వుతో పలకరించే చంద్రశేఖర్ దగ్గరకే చనువుగా వెళతారుట స్టాఫ్ మెంబర్స్ అందరూ.

అందరకీ తల్లో నాలుకలా అవుతూంటే, అంత కంతకు చంద్ర శేఖర్ మీద పెరుగుతున్న ఈర్ష్యని ఎలా చూపించుకోవాలో తెలియక, రాగిణితో స్నేహాన్ని వంకగా పెట్టుకుని అతన్ని న్యూనత పరచాడుట.

ఇద్దరూ ఎదిగిన వాళ్లు, ఎవరి బాధ్యతలు వాళ్ళకి తెలిసినవాళ్ళు. అంచేత, చిన్న పిల్లల్ని అదుపులో పెట్టినట్లు వాళ్ళని అదుపులో పెట్ట డానికి ప్రయత్నించినందుకు వాళ్ళిద్దరికీ గోపీ కృష్ణమీద పట్టలేనంత కోపం వచ్చిందట. సెక్షన్ మార్పుని ఎదిరించలేరు కాబట్టి ఆవిషయంలో మాత్రం ఊరుకుని, తమ స్నేహాన్ని కొనసాగిస్తున్నదని వ్యాఖ్యానిం చింది ఉషారాణి. ఉషారాణి గోపీకృష్ణకి రీసెర్చ్ అసిస్టెంట్.

ఇదంతా విన్నాక, చంద్రశేఖర్ సంసార జీవితం గురించి తెలుసు కోవాలనే కుతూహలం కలిగింది నాలో. అడిగినప్పుడల్లా తనకి తెలిసిన వివరాలు కొన్ని ఉషారాణి నాతో చెబుతూండేది. ఉషారాణికి శోభ చెప్పిందట. శోభ మా పత్రికా విలేఖరి. చంద్రశేఖర్ వాళ్ళు ఉంటున్న ఇంట్లోనే మరో వాటాలో ఉంటోందిట తల్లి దండ్రులతో కలిసి.

చంద్రశేఖర్ భార్యకి తనకి పిల్లలు పుట్టరని కచ్చితంగా తెలిసి నప్పటి నుంచీ హిస్టీరియా మొదలైందిట. ఆవిడ చదువుకున్నది కాదు. చంద్రశేఖర్ విద్యాధికుడు. మేధావి. వాళ్ళిద్దరి మధ్యా శారీరక బంధమే గాని, మానసికంగా ఎటువంటి అనుబంధం ఏర్పడలేదుట. భార్యని కేవలం వంట మనిషిగా, తనకి ఉద్రేకం కలిగినప్పుడు తృప్తిపరచే యంత్రంలాగే చూసేవాడుట-ఇంత చదువుకున్న వాడూ! ఎప్పుడూ పెళ్ళాన్ని ఎక్కడికీ తీసుకు వెళ్ళేవాడు కాదుట. రోజులో చాలా భాగంఆఫీసులో గడిపేవాడు. సెలవురోజుల్లో కూడా స్నేహితులతో కలిసి తాగుతూ, అంత

ర్జాతీయ వ్యవహారాలూ, జాతీయ రాజకీయాలూ, సాహిత్య ప్రక్రియలూ చర్చిస్తూ, రాత్రిళ్ళు ఆలస్యంగా ఇంటికి వెళ్ళేవాడుట. తరచు ఆవిడ అరుపులు పక్కింట్లోకి వినిపిస్తూండేవిట. వన్‌వే ట్రాఫిక్ లాగ ఆవిడ గొంతే వినిపిస్తూండేదిట.

ఇదంతా చంద్రశేఖర్ పక్కింట్లో ఉంటున్న శోభ ఉషారాణికి చెబితే, ఉషారాణి నాకు చెప్పింది.

చంద్రశేఖర్ భార్య ఇంట్లోంచి కాలు కదపకపోయినా, భర్త ఆఫీసు కబుర్లూ అవీ ఆమెకి చేరుతూనే ఉండేవి. భర్తకి ఎవరెవరితో స్నేహమో, అన్నీ తెలుసుట. తరుచు వాళ్ల కలహాల్లో అతని స్నేహితుల పేర్లు దొర్లడం శోభ చాలాసార్లు విందిట. వాళ్ల ఇంట్లో కబుర్లన్నీ ఆఫీసులో చెప్పినట్లుగానే, ఆఫీసు వ్యవహారాలన్నీ కన్నవీ, విన్నవీ మోసుకుపోయి శోభ చంద్రశేఖర్ భార్యకి వినిపించే ఉంటుంది.

శోభ ద్వారానే తెలిసిందిట ఆవిడకి—రాగిణికి ఆడపిల్ల పుట్టిన విషయం. దాంతో ఆవిడ హిస్టీరియా మరింత ఎక్కువైందిట.

ఓ రోజు పొద్దున్నే పదకొండు, ఆ ప్రాంతంలో చంద్రశేఖర్‌కి ఫోనొచ్చింది- ఫోన్‌లో విన్నకబురు అతణ్ణి విభ్రాంతుణ్ణి చేసింది. 'మా ఆవిడ ప్రమాదస్థితిలో ఉందని కబురొచ్చింది' అన్నాడు వినీ వినిపించని స్వరంతో. అతని ముఖంలో నెత్తురు చుక్కలేదు. ఈ పరిస్థితిలో అతణ్ణి ఒక్కణ్ణీ పంపడం భావ్యంకాదని, ఇద్దరు కొలీగ్స్ అతని కూడా వెళ్లారు. మరో అరగంటకి మరో కబురొచ్చింది మాకు—అంతా అయిపోయిందని. సీనియర్ స్టాఫ్ మెంబర్స్ అందరం కలిసి—గోపీకృష్ణతో సహా—చంద్ర

శేఖర్ ఇంటికెళ్లాం. ఏం జరిగిందో, ఎలా పోయిందో ఎవరికీ తెలియదు. ఎవరి ఊహల్లో వాళ్ళున్నారు.

అక్కడ వరండాలో కనపడ్డ దృశ్యాన్ని చూశాక, ఏమిటో అర్థం కాలేదు క్షణం సేపు. అది చలికాలం. అంచేత చలిమంట కాచుకోవడానికి కట్టెలు కాల్చారా అని అనుమానం మెదిలి, అంతలోనే అసలు జరిగిన ఘోరం అర్థమయింది.

భార్యని ఎంత నిర్లక్ష్యం చేసిన వాడికైనా ఇటువంటి ఘోరశిక్ష విధించడం న్యాయంకాదనిపించింది. అతను కన్నీరు కూడా రానంత అఘాతానికి గురికావడం చూసి అతని మీద అందరికీ జాలేసింది. పక్కింటి వాళ్లొచ్చి జరగాల్సిన కర్మకాండ పూర్తి చేయించారు.

రెండు మూడు రోజులకోసారి ఆఫీసు వాళ్లెవరో ఒకరు వెళ్లి చంద్రశేఖర్ దగ్గర కూర్చుని వస్తూండేవారు. ఎవరింటికి రమ్మన్నా రాలేదుట. ఒక్కడూ సిగరెట్లతో, సీసాలతో కూర్చునేవాడుట. ఒకసారి వీళ్లు వెళ్లేసరికి భార్య చీరలూ, మొదలైన వాటిని తీరిగ్గా కూర్చుని తగల బెడుతున్నాడుట. వీళ్లు నిర్ఘాంతపోయి, ఎందుకలా చేస్తున్నారని అడిగితే, 'తను లేనప్పుడు నాకివి మాత్రం ఎందుకు?' అన్నాడుట. ఎవరికైనా పంచిపెట్టొచ్చును కదా అంటే, 'తను వెళ్లిన మార్గాన్నే వీటినీ పంపిస్తున్నాను, మరో మార్గంలేదు' అన్నాడుట. మరోసారి వెళ్లేసరికి వంటింటి సామానంతా ఒక్కొక్కటే పొయ్యిమీద పెట్టి కాలుస్తున్నాడుట. ఒంటరి తనంతో పిచ్చెత్తి పోతున్నాడని గ్రహించి, ఎలాగైనా అతణ్ణి ఒప్పించి, తన ఇంటికి తీసుకుపోవాలని, అతని ఆత్మీయ స్నేహితుడొకడు వెళ్లే సరికి ఇల్లు తాళం పెట్టి ఉందిట. ఎక్కడికి వెళ్లాడో ఇంటివాళ్లకి కూడా తెలియదుట.

ఆఫీసులో అతని గురించి ఏం చెయ్యాలో ఎవరికీ పాలుపోలేదు. ఒక లీవ్ అప్లికేషన్ లేదు, ఒక కబురులేదు. ఎప్పుడొస్తాడో తెలియదు. అతని మీద ఉన్న జాలంతా చిరాకు, కోపంగా మారి, గోపీకృష్ణ, 'అతనెప్పుడూ ఇంతే. ఎవరన్నా లెక్కలేదు' అన్నాడు. చంద్రశేఖర్ సెక్షన్ పనంతా నేనే సూపర్‌వైజ్ చేస్తున్నాను.

ఓ రోజున ఉన్నట్టుండి ఊడిపడ్డాడు చంద్రశేఖర్. కుర్చీలో కూర్చుని దీక్షగా చూస్తున్నదాన్ని, ఎందుకో తలెత్తేసరికి ఎదురుగా అతను! క్షణంసేపు గుండె లయ తప్పింది. దెయ్యాన్ని చూసినట్లుగా నాకు నోట మాట రాలేదు. చివరికి అతనే పలకరించాడు 'బావున్నారా?' అని.

నేను లేచి నిలబడి, 'కూర్చోండి, మీరు బావున్నారా?' అన్నాను వెంటనే. అతను కూర్చోలేదు.

'సెక్షన్ బాధ్యత అంతా మీపైన పడినట్టుంది. ఏమైనా ప్రోబ్లమ్స్ ఉన్నాయా?' అన్నాడు మామూలుగా మాట్లాడుతున్నట్లు.

'అబ్బే, ప్రోబ్లమ్స్ ఏమీలేవు' అన్నాను చిరునవ్వు తెచ్చిపెట్టుకుని

'సరే, వస్తాను' అనేసి, మారు మాట్లాడటానికి అవకాశం లేకుండా అక్కణ్ణించి వెళిపోయాడు.

మధ్యాహ్నం భోంచేస్తున్నప్పుడు రాగిణిని అడిగాను 'చంద్ర శేఖర్‌ని కలుసుకున్నావా?' అని.

'ఆ' నేను గోపీకృష్ణతో మాట్లాడుతూంటే వచ్చారక్కడికి. నీ గురించి చాలా గొప్పగా పొగిడాడు గోపీకృష్ణ' అంది

ఆ పొగడ్త అసందర్భం అనిపించింది నాకు. మరణ శయ్యా పక్కన ఉన్న మనిషిని 'నువ్వు కట్టుకున్న చీర చాలా బావుంది' అని పొగిడినట్లుగా ఉంది.

'చంద్రశేఖర్ నీతో ఏమీ మాట్లాడలేదా?' అన్నాను ధైర్యం చేసి. చెప్పింది-అతనే తరవాత రాగిణి సీటు దగ్గరకి వెళ్ళాడుట. ఆమెకి పుట్టిన పిల్ల ఎలా ఉందనీ. ఎవరిపోలిక అనీ, పేరేం పెట్టారనీ, ఎంత బరువుం దనీ ఇలాగే ఎన్నో కుతూహలంగా అడిగాడుట

'అతను మళ్ళీ ఆఫీసుకి ఎప్పుడొస్తారు'? అన్నాను.

'ఏమో, నేనడగ లేదు. డ్యూటీలో చేరడానికే వచ్చారనుకున్నాను. వెళ్ళేటప్పుడు నాతో చెప్పనుకూడా లేదు' అంది.

'ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్ళారో, ఏం చేశారో అడగలేదా?' అన్నాను.

'లేదుగానీ, అక్కడే ఉంటున్నారా అని అడిగాను. 'ఇంటివాళ్ళు ఇల్లు ఖాళీ చెయ్యమంటున్నారు, ఇంకోటి వెతకాలి' అన్నారు. నే నింకేమీ అడగలేదు' అంది రాగిణి.

మర్నాడు లంచ్ తీసుకోబోతున్న సమయంలో ఫొటోగ్రాఫర్ చక్రవర్తి ఫోన్‌లో చెప్పిన కబురువిని మా చెవులను మేమే నమ్మలేక పోయాం.

అందరం తక్షణం చంద్రశేఖర్ ఇంటికి వెళ్ళాం. ముందు గదిలో అతని శవం నేల మీద అస్తవ్యస్తంగా పడి ఉంది. తల చితికి రక్తం కారి గడ్డకట్టుకు పోయింది.

చక్రవర్తి ముఖంలో దుఃఖం గూడు కట్టుకుని ఉంది. మాలో కొంద రం అతన్ని సమీపించి, చంద్రశేఖర్ మరణం గురించి ఎప్పుడు తెలిసిం దనీ, ఎలా సంభవించిందనీ అడిగాం. అతను గద్గద స్వరంతో చెప్పాడు.

'నిన్నరాత్రి చాలాసేపటి వరకూ నాతోనే గడిపాడు. నేను కవర్ చేస్తున్న ఫొటోఫీచర్స్ గురించి చర్చించుకున్నాం కూడా. విస్కీ తీసుకున్నాం. తీసుకోవడం ప్రారంభిస్తూ గ్లాసు పైకెత్తి 'మహాభి నిష్క్రమణానికి' అంటూ నా గ్లాసుకి క్లిక్ మనిపించాడు. 'వాట్ నాన్‌సెన్స్' అని కొట్టి పారేశాను అతని మాటని. 'అవునోయ్. ఎందుకోసం, ఎవరి కోసం బ్రతకాలి?' అన్నాడు. 'పరోపకారార్థ మిదం శరీరం అని ప్రతివాడూ అనుకుంటే ఈ ప్రపంచం ఇలా ఉండేది కాదు' అన్నాను. 'చాలు, ఇంతవరకు అనుభవించింది చాలు' అన్నాడు. రాత్రికి మా ఇంట్లో పడుకోమన్నాను. ఒప్పుకోలేదు. వెళ్ళిపోయాడు. అదే ఆఖరి చూపు అవుతుందనుకోలేదు' అన్నాడు చక్రవర్తి కళ్ళనీళ్ళు పెట్టుకుని.

రాగిణి ఏమనుకుందో నాకు తెలియదు గానీ, నాకు మాత్రం సరి దిద్దుకోలేని తప్పు చేసిన భావన కలిగింది. అతను ఆ క్రితం రోజు 'ఏమైనా ప్రోబ్లమ్స్ ఉన్నాయా' అని అడిగినప్పుడు, 'అవునండీ, ఒక్క దాన్నీ యాతన పడుతున్నాను, మీరు ఎప్పుడొస్తారని ఎదురుచూస్తున్నాను' అని అంటే, అతను నా కోసమయినా- నా సమస్యల్ని పరిష్కరించడం కోసమయినా బ్రతికి ఉండేవాడేమో? అతని అవసరం నాకూ లేదన్న విరక్తి భావం అతనికి కలిగేది కాదేమో? గుండెల్లో ఏదో చెప్పలేని మంట మొదలైంది.

(జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక, అక్టోబరు, నవంబరు'89)